RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | బుధవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 149 | మే 07, 2025 | వెల : రూ.3-00



సాయి నగర్ గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం..

4లో..






# రేవంత్ వ్యాఖ్యలు భవిష్యత్తుకు శాపం

■ తెలంగాణను శపిస్తే సహించం..! ■ దొంగ కాబట్టే..అప్పు పుట్టడం లేదు ■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

వేల మంది త్యాగాలతో ఏర్పాడిన తెలంగాణను అవమానించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని, పరిపాలన చేతకాదని.. సీఎం కాడి పడేశారని మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగ సంఘాల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రాష్ట్ర భవిష్యత్‌కు శాపంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి దొంగ కాబట్టే.. అప్పు పుట్టడం లేదన్నారు. కాంగ్రెస్ లాంటి ఎర్రి పార్టీ.. దొంగ చేతికి తాళాలు ఇచ్చిందని అన్నారు. రేవంత్ రెడ్డిని సీఎం చేసి..ఏఐసీసీ, రాహుల్ గాంధీ చాలా పెద్ద తప్పు చేశారన్నారు.

తెలంగాణ భవిష్యత్తుకు శాపం పెట్టే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని, ఢిల్లీ పార్టీలను నమ్మితే మోసపోతామన్న కేసీఆర్ మాటలు నిజమయ్యాయన్నారు. ఇంత దివాలాకోరు మాటలు ఏ రాజకీయ నాయకుడు మాట్లాడలేద న్నారు. అధికారంలోకి వస్తామని.. కాంగ్రెస్ పార్టీ అనుకోలేదని, అందుకే విచ్చలవిడిగా హామీలు ఇచ్చిందని కేటీఆర్ తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పిందే ఉద్యోగులు అడుగుతున్నారని, ప్రజల ముందు ఉద్యోగులను విలన్‌లుగా చిత్రీకరించే కుట్ర రేవంత్ రెడ్డి చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అందాల పోటీలకు రూ.200 కోట్లు ఉన్నాయి కానీ.. ఉద్యోగులకు ఇవ్వటానికి డబ్బులు లేవా అని ప్రశ్నించారు. నాయకత్వ లోపం..కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పెట్టిన శాపం అని అన్నారు. తండ్రి లాంటి ముఖ్యమంత్రే సొంత రాష్ట్రానికి శాపాలు పెట్టడం స్వతంత్ర భారతదేశంలో ఎక్కడా లేదని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ఈ శతాబ్దపు మోసమని, వ్యక్తిగతంగా తమపై చేసిన రోత మాటలను సయితం పడ్డామని.. తెలంగాణను శపిస్తే సహించమని కేటీఆర్ స్పష్టం చేశారు.



ఆర్ఎఫ్‌సిఎల్, కార్మిక సంఘం మధ్య

## త్రైపాక్షిక ఒప్పందం

**వేద న్యూస్,ఎన్టీపీసీ,జ్యోతినగర్:**

ఆర్ఎఫ్‌సిఎల్ కార్మిక సంఘం ఆర్ఎఫ్‌సిఎల్ యాజమాన్యం మధ్య నెలకొన్న సమస్యల పరిష్కామయ్యాయి. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) మమ్మద్ యూసఫ్ సమక్షంలో మంగళవారం త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఉద్యోగుల అదనపు పనికి ఓవర్ టైం చెల్లించేందుకు ఫ్యాక్టరీల చట్టం 1948, సెక్షన్ 59 ప్రకారం యాజమాన్యం అంగీకరము తెలిపారనీ అన్నారు. అలాగే వారాంతపు సెలవులు క్రమబద్ధంగా ఇవ్వాలని, ఫ్యాక్టరీల చట్టం సెక్షన్ 52 ప్రకారం ఏడవ రోజు సెలవు ఉండేలా షిఫ్ట్ రోటా అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారన్నారు. ఈ సందర్భంగా వర్క్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయడానికి కూడా యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని యాజమాన్య తెలిపిందనీ చెప్పారు. ఈ చర్చల్లో కార్మిక సంఘం తరపున అధ్యక్షుడు శివ్ ప్రకాష్ ప్రజాపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. బిక్షపతి, ప్రధాన కార్యదర్శి అభిషేక్ సింగ్, కోశాధికారి అనిర్బన్ చక్రబర్తి పాల్గొన్నారు. యాజమాన్యం తరపున మేనేజర్ (హెచ్.ఆర్) మయూక్ ధావన్, అసిస్టెంట్ మేనేజర్ (హెచ్.ఆర్) అజయ్ కుమార్, రమేష్ పాల్గొన్నారు. సహకారం అందించిన అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు కార్మిక సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.



## రాష్ట్ర పురోగతికి సీఎస్ రామకృష్ణరావు అపార అనుభవం అవసరం

■ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణ నూతన సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన సీనియర్ ఐఏఎస్ రామకృష్ణరావుకి రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభినందనలు తెలిపారు. ఆయన సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మంత్రి సురేఖను సెక్రటేరియట్‌లో ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించి సీఎస్ రామకృష్ణరావుకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర పరిపాలన విభాగంలో, తెలంగాణ ఆర్థిక కార్యకలాపాల్లో సీఎస్ రామకృష్ణరావుకి ఉన్న అపార అనుభవం ప్రస్తుతం రాష్ట్ర పురోగతి ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి సీనియర్ ఐఏఎస్ నేతృత్వంలో పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్రంలోని అన్ని విభాగాలు ముందుకు వెళుతాయని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో తమ ఎండోమెంటు డిపార్టుమెంటు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కాళేశ్వరం సరస్వతీ నది పుష్కరాలు సమర్థవంతంగా నిర్వహించేందుకు రామకృష్ణరావు కృషి చేయాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖకి రామకృష్ణరావు ధన్యవాదాలు తెలిపారు.

## నేరాల నియంత్రణకు నిరంతరం కృషి చేయాలి

■ మామునూర్ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ




**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం మామునూర్ డివిజన్ పరిధిలోని మామునూర్, ఏనుమాముల, గీసుగొండ పోలీస్ స్టేషన్లను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తోలిసారిగా మామునూర్ డివిజన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్సైలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్సై ని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని అన్నారు.ట్రై సిటి పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలన్నారు. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూర్ ఏసిపి తిరుపతి, ఇన్స్‌స్పెక్టర్లు రమేష్,రాఘవేందర్, మహేందర్ తో పాటు స్టేషన్ ఎస్సైలు పాల్గొన్నారు.



## భానుడి భగ..భగ.. మీటర్ గిరగిరా..

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

రంగారెడ్డి జిల్లాలో భానుడి భగభగలు విద్యుత్ వినియోగంపై ప్రభావం చూపిస్తున్నాయి. గత ఆది, సోమ, మంగళవారాలతో కలుపుకొని రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం పెరుగుతున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగరవాసులు ఇండ్లు, ఆఫీసులలో, ఏసీలు, కూలర్లు ఎక్కువగా వినియోగిస్తూ ఉండడంతో విద్యుత్తు డిమాండ్ పెరిగింది. ఒక్క సోమవారం నాడే 89.57 మిలియన్ యూనిట్లు (ఎం యు) విద్యుత్ వినియోగం నమోదు అయ్యింది. ఈ నెలలో విద్యుత్ వినియోగం 100 మిలియన్ యూనిట్లకు చేరే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు తెలుపు తున్నారు.

### గరిష్ట ఉష్ణోగ్రతలు

ఉదయం 9 గంటల నుండి భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని రాజేంద్రనగర్ మెహిదీపట్నం లంగర్ హౌస్ ప్రాంతాలలో 42 డిగ్రీలు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. అయితే బుధ గురు శుక్రవారాలలో రంగారెడ్డి జిల్లా ప్రాంతంలో ఉరుములతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాదు వాతావరణ కేంద్రం తెలిపింది.

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

■ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వర్ధన్నపేట :**



భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మంగళవారం వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి, దివిటిపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను గురించి తెలుసుకున్నారు. భూభారతి చట్టంపై అవగాహన కల్పించి, వారికున్న సందేహాలను నివృత్తి చేశారు. భూ సంబంధిత సమస్యలు ఉన్నవారు నిర్ణీత ప్రొఫార్మాలో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని హెల్ప్‌డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. ఫార్మార్ రిజిస్ట్రర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి, వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తోందని తెలిపారు. సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు విస్తీర్ణం హెచ్చుతగ్గులు వారసత్వ భూములు భూ స్వభావం, తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం వంటి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ సీఈఓ రామిరెడ్డి, డబ్ల్యూ ఎస్ డి ఈ శ్రీనివాస్, తహసిల్దాల్ విజయసాగర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ఎత్తు తగ్గిస్తామని తవ్వారు..!

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ లోని అల్మా గూడాలో రెండు కాలనీల మధ్య ఎత్తుగా ఉన్న ఒక చిన్న లింకు రోడ్డును ఏటవాలుగా నిర్మించడానికి ఐదు లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సదరు నిర్మాణం కోసం ఇటీవల అధికారులు ఎత్తుగా ఉన్న పాత సిసి రోడ్డును తువ్వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా తాజాగా వేసే రోడ్డు ఎత్తు మునుపటిలాగే ఉండడంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత రోడ్డును తవ్వడం ఎందుకు తిరిగి అంతే ఎత్తులో రోడ్డు నిర్మించడం ఎందుకు? అని వారు ప్రశ్నిస్తున్నారు. అల్మాస్గూడలోనే ఎస్ ఎస్ ఆర్ నగర్ కాలనీ లక్ష్మీ నగర్ కాలనీల మధ్య నలుగుతున్న సమస్య ఇది.

### ఐదు లక్షలు వృధాయేనా?

రోడ్డుకు అటు 3 చొప్పున ఇటు మూడు చొప్పున మొత్తం ఆరు ఇండ్లు ఉండగా సుమారు 30 మీటర్ల దాకా ఉంటుంది. ఆ చిన్న దూరంలో రోడ్లపై వాహనాలు వెళ్లలేని విధంగా ఎత్తుగా ఉండడంతో దాన్ని దిగువన గల రోడ్డుకు

మిగతా 4వ పేజీలో..

# ముస్లిం దేశాల మద్దతు కోసం పాకిస్తాన్ యత్నం



లాహోర్ : జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, దీని వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. భారత్ ప్రతీకార చర్యలకు సిద్ధమవుతుండగా, పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు అంతర్జాతీయ సహకారం కోరుతూ దౌత్యపరమైన ప్రయత్నాలు చేస్తున్నారు.పహల్గాంలోని బైసరన్ మైదానంలో జరిగిన ఈ దాడి, భారత్‌లోని పర్యాటకులపై లక్ష్యంగా సాగిన అత్యంత ఘోరమైన ఉగ్రదాడుల్లో ఒకటిగా నిలిచింది. ఈ దాడిని లష్కర్-ఎ-తొయిబా తో సంబంధం ఉన్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ సంస్థ తామే చేసినట్లు మొదట ప్రకటించినప్పటికీ, తర్వాత ఆ ప్రకటనను ఉపసంహరించుకుంది. ఈ దాడి వెనుక పాకిస్తాన్ సైన్యం మరియు ఉగ్రవాద సంస్థల సమన్వయం ఉన్నట్లు భారత గూఢచార సంస్థలు ఆరోపించాయి. ఈ ఘటన భారత్‌లో తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది, మరియు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దీనికి గట్టి సమాధానం ఇవ్వాలని నిర్ణయించింది.

భారత్ ప్రతీకార చర్యలు

దౌత్య చర్యలు: భారత్ పాకిస్తాన్‌తో దౌత్య సంబంధాలను తెంచుకుంది, వాఘా సరిహద్దును మూసివేసింది, మరియు పాకిస్తానీ పౌరులకు జారీ చేసిన వీసాలను రద్దు చేసింది.

సింధు నదీ ఒప్పందం రద్దు: 1960లో రూపొందిన సింధు నదీ ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ నిర్ణయం తీసుకుంది, దీనిని పాకిస్తాన్ 'యుద్ధ చర్య'గా అభివర్ణించింది.

సైనిక సన్నద్ధత: భారత సైన్యం సరిహద్దుల్లో అప్రమత్తంగా ఉంటూ, లైన్ ఆఫ్ కంట్రోల్ (ఒసీఅ) వెంబడి పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు గట్టిగా స్పందిస్తోంది.

పాకిస్తాన్ భయాందోళన..

పహల్గాం దాడి తర్వాత భారత్ యొక్క కఠిన వైఖరి మరియు అంతర్జాతీయ మద్దతు పాకిస్తాన్‌ను తీవ్ర ఆందోళనలో ముంచెత్తింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ యుద్ధాన్ని నివారించేందుకు వివిధ దేశాలతో దౌత్య సంప్రదింపులు జరుపుతున్నారు.ఐక్యరాజ్యసమితి: షరీఫ్ ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్‌తో సంప్రదించి, భారత్?పాకిస్తాన్ ఉద్రిక్తతలను తగ్గించేందుకు మధ్యవర్తిత్వం చేయాలని కోరారు.గల్ఫ్ దేశాలు: సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), మరియు కువైట్ రాయబారులతో సమావేశాలు నిర్వహించి, భారత్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. షరీఫ్ సౌదీ అరేబియా రాయబారితో జరిగిన సమావేశంలో దక్షిణాసియాలో శాంతి కోసం పాకిస్తాన్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

చైనా మరియు రష్యా: పాకిస్తాన్ ఈ రెండు దేశాలను సంప్రదించి, భారత్ యొక్క సంభావ్య దాడిని నిరోధించేందుకు సహకారం కోరింది. పాకిస్తాన్ ఈ దాడిపై నిష్పక్షపాత విచారణ కోసం కూడా పిలుపునిచ్చింది.భారత్ నుంచి సంభావ్య దాడిని ఎదుర్కొనేందుకు పాకిస్తాన్ సైన్యం రక్షణాత్మక చర్యలను చేపట్టింది. లష్కర్?ఎ?తొయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు అదనపు భద్రత కల్పించడం, ఓ?ఇ వెంబడి సైనిక సన్నద్ధతను పెంచడం, మరియు సరిహద్దు ప్రాంతాల్‌ఆహార సరఫరా నిల్వలను పెంచడం వంటి చర్యలు తీసుకుంది.పహల్గాం దాడిని అనేక దేశాలు ఖండించాయి, మరియు భారత్ యొక్క ప్రతీకార చర్యలకు మద్దతు ప్రకటించాయి. ఈ ఘటన అంతర్జాతీయంగా పాకిస్తాన్‌ను ఒంటరిగా నిలబెట్టింది.

భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలు

అమెరికా: యుఎస్ స్టేట్ సెక్రటరీ మార్కో రూబియో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సంప్రదించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు పూర్తి మద్దతు ప్రకటించారు. అమెరికా భారత్ యొక్క 'స్వీయ రక్షణ హక్కు'ను గుర్తించింది.యూరోపియన్ దేశాలు: యూకె, డెన్మార్క్, మరియు స్విట్జర్లాండ్ వంటి దేశాలు ఈ దాడిని ఖండించాయి మరియు భారత్‌తో సహకరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి.ఆసియా దేశాలు: దక్షిణ కొరియా జపాన్ భారత్ యొక్క 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా శూన్య సహనం' విధానాన్ని సమర్థించాయి.

పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చే దేశాలు

చైనా: భారత్-పాకిస్తాన్ సంబంధాల్లో చైనా సంప్రదాయకంగా పాకిస్తాన్‌కు మద్దతు ఇస్తోంది. పహల్గాం దాడి సందర్భంగా కూడా చైనా పాకిస్తాన్‌కు రాజకీయ మద్దతు అందించే అవకాశం ఉంది.టర్కీ మరియు అజర్బైజాన్: ఈ రెండు దేశాలు కాశ్మీర్ విషయంలో గతంలో పాకిస్తాన్‌కు మద్దతు ప్రకటించాయి మరియు ఈ సందర్భంలో కూడా అండగా నిలిచే సూచనలు ఉన్నాయి.బంగ్లాదేశ్: బంగ్లాదేశ్‌లో ఇటీవలి రాజకీయ సంక్షోభం తర్వాత ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా వైఖరి అవలంబిస్తోంది. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్ పాకిస్తాన్‌కు మద్దతు ఇవ్వవచ్చని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

బంగ్లాదేశ్ రాజకీయ సంక్షోభం..

బంగ్లాదేశ్‌లో 2024లో జరిగిన రాజకీయ అస్థిరత తర్వాత, ముహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వం భారత్‌తో సంబంధాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తూ, పాకిస్తాన్‌తో సన్నిహిత సంబంధాలను పెంచుకుంటోంది. బంగ్లాదేశ్ యొక్క ఈ కొత్త వైఖరి భారత్?పాకిస్తాన్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్తాన్‌కు రాజకీయ ప్రయోజనం చేకూర్చవచ్చు. అయితే, బంగ్లాదేశ్ యొక్క ఆర్థిక మరియు రాజకీయ అస్థిరత దీనిని పరిమితం చేయవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.పహల్గాం దాడి భారత్?పాకిస్తాన్ మధ్య యుద్ధ సంభావ్యతను పెంచినప్పటికీ, రెండు దేశాలూ అణ్వాయుధ శక్తులు కావడం వల్ల జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.భారత్ యొక్క గత ప్రతీకార చర్యలు (2016లో ఉరి, 2019లో పుల్వామా) సర్జికల్ స్ట్రైక్‌లు మరియు ఎయిర్‌స్ట్రైక్‌ల రూపంలో ఉన్నాయి. పహల్గాం దాడి కూడా ఇలాంటి ప్రతీకార చర్యలకు దారితీయవచ్చు. పాకిస్తాన్ సైన్యం ఈ దాడిని దేశీయ రాజకీయ సంక్షోభం నుండి దృష్టి మళ్లించేందుకు ఉపయోగించుకున్నట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి.అమెరికా, ఐక్యరాజ్యసమితి, మరియు గల్ఫ్ దేశాలు రెండు దేశాలను శాంతియుత సంప్రదింపులకు ప్రోత్సహిస్తున్నాయి.చైనా మరియు రష్యా వంటి దేశాలు పాకిస్తాన్‌కు మద్దతు ఇచ్చినప్పటికీ, అవి కూడా ఓపెన్ యుద్ధాన్ని నివారించేందుకు ఒత్తిడి చేయవచ్చు.

# బీఆర్ఎస్ పై మంత్రుల మండిపాటు

నల్గొండ : పదేళ్ల బిఆరెస్ పాలన -పదహారు నెలల కాంగ్రెస్ పాలన పై ప్రజల్లో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన సాగు నీటి ప్రాజెక్టులు నాణ్యత లోపం తో కూలి ఇప్పుడు ఇలా శిథిలావస్థకు చేరుకుంటున్నాయని కాంగ్రెస్ మంత్రులు బిఆరెస్ పై బాణాలు ఎక్కు పెట్టారు. కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ లకు ప్రజా ధనం దుర్వినియోగం అయ్యిందని మంత్రులు మండి పడుతున్నారు. కాలేశ్వరం ప్రాజెక్టును బిఆరెస్ అప్పటి తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా చెప్పుకున్నా... ఇప్పుడు అవినీతి నిండిపోయిందనే ఆరోపణలు కాంగ్రెస్ చేస్తుంది. ఈ ప్రాజెక్టు కోసం 94 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా . ఆశించిన ఫలితాలు మాత్రం రాలేదని వాదన వినిపిస్తుంది. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ఎక్కువ దృష్టి పెట్టి, దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందనని ఆరోపిస్తున్నారు. పనికిరాని కాలేశ్వరం ప్రాజెక్టులో గత ప్రభుత్వం 94 వేల కోట్లను ఖర్చు పెట్టింది. వాళ్ల టైం లోనే డిజైనింగ్ అయింది, వాళ్ల టైంలోనే పూర్తి చేశారు,వాళ్ల టైంలోనే కూలిపోయిందని బిఆరెస్ పై విరుచుకు పడుతున్నారు. "గత పదేళ్లలో ఇరిగేషన్ శాఖ 1లక్షా81 వేల కోట్లు ఖర్చుపెట్టి ఎస్ ఎల్ బి సి , దేవాదుల, పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ,నెట్టెంపాడు, భీమ లాంటి ప్రాజెక్టులు 1 పర్సెంటేజ్ కూడా పూర్తి చేయలేదు. ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజలకు ఏదో విధంగా ఈ ఎస్ ఎల్బీ సి ప్రాజెక్టు పూర్తి చేస్తాం. చాలాకాలం కింద ఆగిపోయిన గందమల్ల ప్రాజెక్టును కూడా తిరిగి ప్రారంభిస్తున్నాం. మేము వచ్చిన తర్వాతనే ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులను పురోగతి సాధించి ముందుకు తీసుకుపోతున్నాము. తక్కువ ఖర్చుతో తక్కువ సమయంలో ఏ విధంగా ఎక్కువ ఆయకట్టు స్థిరీకరణ సాధించెలా చర్యలు చేపడతాం.పదేళ్ల బిఆరెస్ పాలన లో"దక్షణ తెలంగాణ ప్రాజెక్ట్ లకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటున్నారు.. యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంతో... రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత... ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మన జిల్లాలో 80% ధాన్యాన్ని కొనుగోలు చేశాం. తప్పకుండా మీ సమస్యలలో మేము ఒకడిగా ఉంటామని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత... 80 నుంచి 84 శాతం జనాభాకు ఉచితంగా ఆరు కిలోల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ పథకం కోసం ప్రభుత్వం 13 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందడంతో లబ్ధిదారులు ఈ పథకం పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నిటిలో సన్న బియ్యం పథకం నాకు చాలా నచ్చిందంటున్న మంత్రి గతంలో ఇచ్చిన దొడ్డు బియ్యం 80 శాతం పక్కదారి పట్టాయన్నారు. కానీ ఈరోజు ప్రతి షాపు లో నాలుగు రోజులలోనే సన్న బియ్యం బియ్యం అయిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం... కాలేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి ఆరోపణలు చేస్తుంటే, బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తోంది. తెలంగాణ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన శత్రువని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ రాజకీయ ఆరోపణలు, ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. మిర్యాలగూడ లో జరిగిన మీటింగ్ లో కోమటిరెడ్డి మాట్లాడుతూ, ఓ పెద్దాయన అంటాడు తెలంగాణకు మొదటి శత్రువు కాంగ్రెస్ పార్టీ ఏ అని. పదేళ్లు ఫామ్ హౌస్ లో పడుకొని లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డాయన కాంగ్రెస్పై నిందలు వేయడం సరికాదని మంత్రి హితవు పలికారు.. తెలంగాణ లో ప్రాజెక్టు అవినీతి గుట్టలు.. బయటపడుతున్న కొద్దీ...కాంగ్రెస్, బిఆరెస్ నేతల మధ్య రాజకీయ ఆరోపణలు పెరుగుతున్నాయి.రోజు రోజు కు రాజకీయం వేడెక్కుతుంది. సంక్షేమ పథకాల అమలు పై బిఆరెస్ నిలదీస్తుంది.ఆరోపణలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి. దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందా? ప్రజలకు న్యాయం జరుగుతుందా? తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులు, ప్రజల ఆశలు, రాజకీయ నాయకుల అవినీతి... ఈ కథకు ముగింపు ఎప్పుడు వేచి చూడాల్సి ఉంది.

# ఆరోగ్యం బాగుకోసం నడక శ్రేయస్కరం

## - మెగా హెల్త్ క్యాంపులో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్






మంథని : ప్రస్తుతం మానవ జీవన శైలిలో వస్తున్న మార్పులు, తగ్గుతున్న శారీరక శ్రమ, ఆహార అలవాట్లు అనేక రుగ్మతలకు దారి తీస్తున్నాయని, ప్రతీ రోజు కనీసం అరగంట నడక ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కారంమని వాకార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ అన్నారు. సోమవారం వాకార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల్లో ఆరోగ్యం పట్ల మరింత చైతన్యం పెరిగిందని, నడక, యోగా, వ్యాయామంపై అత్యధికులు ఆసక్తి చూపుతున్నారని క్రమం తప్పకుండా రోజూ నడిస్తే మధు మేహం వచ్చే అవకాశం తగ్గుతుందన్నారు. అలాగే మధుమేహ ఉన్నా సరే గ్లూకోజు అదుపులో ఉంటుందని, అధిక రక్తపోటు, గుండె, క్యాన్సర్ సమస్యలు తదితర ముప్పును తగ్గిస్తుందని, శరీర బరువును నియం త్రిస్తుందని, మానసిక ఒత్తిడి, నిద్రలేమిని అధిగమించవచ్చునని, జీవ క్రియలను మెరుగుపర్చుతుందని, మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరగడంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని ఆయన తెలిపారు. ఈ శిబిరంలో 120 మందికి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దీక్షిత్ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేపట్టి రోగనిర్దారణ చేశారు.

ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ వాకర్స్, జర్నలిస్టులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోషియేషన్

ప్రధాన కార్యదర్శి నాంపల్లి రమేష్, గౌరవ అధ్యక్షులు రావికంటి మనోహర్, కొమరోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వేల్పుల గట్టయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరి గంధం ఆంజనేయులు, సాంస్కృతిక కార్యదర్శి లక్కాకుల నాగరాజు, గెజిటెడ్ అధికారుల సంఘం సంస్కృతిక కార్యదర్శి రావుల తిరుమల్, సహాయ కార్యదర్శి తాటి సమయ్య గౌడ్, కోశాధికారి సిలివేరి సతీష్, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పోతరాజు సమ్మయ్య, మాజీ సర్పంచ్ ఒడ్నాల శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కొమురోజు మారుతి బర్ల సంపత్, బాసాని సాగర్, రాజిరెడ్డి హరిష్, దాసరి రాజేశం, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# లోకల్ బాడీ ఎన్నికలకు అంతా సిద్ధం

నల్గొండ : స్థానిక సంస్థలకు ఎన్నికలు జులైలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కుల గణన కారణంగా ఎన్నికలు వాయిదా పడినప్పటికీ, నిధుల కొరతతో ప్రభుత్వం నష్టపోతున్నందున ఎన్నికలు నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. బీసీ నాయకులతో సమావేశమై ముఖ్యమంత్రి తన నిర్ణయాన్ని చెప్పగా.. వారు కూడా సమ్మతించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, చిహ్నాల ఖరారు, బ్యాలెట్ పత్రాల ముద్రణ వంటి ముందస్తు ఏర్పాట్లను కూడా ఎన్నికల సంఘం పూర్తి చేసిందిఇప్పటికే పదవీ కాలం ముగిసిన గ్రామీణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రెండు నెలల క్రితమే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసినప్పటికీ, కుల గణన, బీసీ రిజర్వేషన్ పెంపు ప్రక్రియతో స్థానిక ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసింది. స్థానిక సంస్థల్లో,విద్య, ఉద్యోగ నియామకాల్లో విడివిడిగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు అసెంబ్లీ తీర్మాన చేసి కేంద్రం ఆమోదం కోసం పంపింది.కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కుల గణన చేపట్టాలని ఇటీవల నిర్ణయించింది. ఈ సంవత్సరం చివరిలో జన గణన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ జనాభా సర్వే పూర్తి కావడానికి కనీసం రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. పంచాయతీల పదవీ కాలం 2024 జనవరి 31వ తేదీన, జిల్లా, మండల పరిషత్‌ల గడువు 2024 జులైలో ముగిసింది. స్థానిక సంస్థలకు పాలక మండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. కాబట్టి, ఎన్నికలు ఇంకా ఆలస్యం అయితే ప్రభుత్వం ప్రతి సంవత్సరం 1,500 కోట్లు నష్టపోతుంది.కేంద్రం కుల గణనపై ప్రకటనతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీసీ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించి ఎన్నికల గురించి చర్చించారు. పాలక మండళ్లు లేకపోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోతోందని వివరించారు. పంచాయతీలకు నిధులు, సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి ఉందని తెలిపారు. కుల గణన పూర్తయ్యే వరకు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా వేచి ఉండలేమన్న సీఎం అభిప్రాయంతో చాలా మంది నాయకులు ఏకీభవించారు.

తెలంగాణలో కుల గణనకు, స్థానిక సంస్థల ఎన్నికలకు ఎటువంటి సంబంధం లేదని, ఎన్నికలకు వెళ్లవచ్చని రేవంత్ రెడ్డి చెప్పారు. అవసరమైతే ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు కూడా బీసీ నాయకులు అంగీకరించారు. కాకపోతే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం టిక్కెట్ల హామీ ఇవ్వాలని సూచించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను గుర్తించడం, చిహ్నాలను ఖరారు చేయడం మరియు రాష్ట్రంలో బ్యాలెట్ పత్రాలను ముద్రించడం వంటి ముందస్తు ఎన్నికల కసరత్తులను రాష్ట్ర ఎన్నిక సంఘం ఇప్పటికే పూర్తి చేసింది. ఫిబ్రవరిలోనే మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా ఎన్నికల అధికారులను కూడా కోరింది.

# ప్రాణాలు తీస్తున్న లిఫ్టులు

## - ఈ ఏడాది ఇప్పటివరకు ఆరుగురు మృతి

హైదరాబాద్ : ఒకటి కంటే ఎక్కువ అంతస్తులు ఉండే ఇండ్లు, భవనాలు, అపార్ట్‌మెంట్లలో కింది నుంచి పైకి వెళ్లేందుకు సాధారణంగా లిఫ్టులను వాడుతారు. లిఫ్ట్ ద్వారా కింది నుంచి పైఅంతస్తులోకి ఎలాంటి ఇబ్బంది లేకుండా వెళ్లేలా ఉండాలి. కానీ ప్రాణాలు పోయేలా కాదు. కానీ ఇటీవల చోటుచేసుకుంటున్న సంఘటనలు చూస్తే లిఫ్టులు ప్రాణాలు తీసే యంత్రాలుగా కనిపిస్తున్నాయి.హైదరాబాద్ నగరంలో లిఫ్ట్ ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల్లో నాసిరకం లిఫ్టులు.. తక్కువ శ్రద్ధతో నిర్వహణ, అధిక వాడకంతో ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. కేవలం గత నెలలోనే నాలుగు లిఫ్ట్ ప్రమాదాలు జరగడం గమనార్హం. కొన్ని ఘటనల్లో ప్రాణనష్టం జరిగింది. తెలంగాణలో ఇప్పటివరకు లిఫ్ట్ యాక్ట్ అమల్లోకి రాలేదు. భద్రతా ప్రమాణాలు, లిఫ్ట్‌ల నాణ్యత, సరఫరాదారుల అర్హతలు, నిర్వహణ మార్గదర్శకాలు లేకపోవడంతో నిర్మాణదారులు తక్కువ ఖర్చుతో నాసిరకం లిఫ్ట్‌లను ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఇత ర రాష్ట్రాల్లో (కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు) ఇప్పటికే నిషేధించబడిన కొలా ప్సిబుల్ డోర్ లిఫ్టులు రాష్ట్రంలో ఇప్పటికీ వాడుతున్నారు.కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి నిర్మాణాలు చేపట్టే యజమానులు లిఫ్టులను ఏర్పాటు చేసే విషయంలో మాత్రం తక్కువలో వచ్చే నాసిరకమైనవి ఇన్‌స్టాల్ చేస్తున్నారు. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వందమంది నివసించే అపార్ట్‌మెంట్లలో కనీసం 6 నుంచి 8 మంది కెపాసిటీ ఉండే లిఫ్టులను ఏర్పాటుచేయాలి.కానీ డబ్బులు తక్కువ అవుతా యని నాలుగు నుంచి ఆరుగురు మాత్రం ఎక్కే కెపాసిటీ ఉన్న లిఫ్టులను ఏర్పాటు చేస్తున్నారు. ఫలితంగా ఓవర్‌లోడ్ వల్ల లిఫ్ట ప్రమాదాలు జరుగుతున్నాయి.


నాలుగేళ్ల బాలుడు నరేందర్ లిఫ్ట్ గేట్‌లో ఇరుక్కొని మృతి

మరో ప్రమాదంలో లిఫ్టులో ఇరుక్కుని వాచ్‌మన్ కుమారుడు అక్కడికక్కడే చనిపోయాడు

మియాపూర్‌లో ఇద్దరు కాంట్రాక్ట్ వర్కర్లకు లిఫ్ట్ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా ఒకరు చనిపోయారు

మాసాబ్ ట్యాంక్‌లో 6 ఏళ్ల బాలుడు లిఫ్ట్‌లో ఇరుక్కొని తీవ్ర గాయాలు

సిరిసిల్లలో ఓ పోలీస్ ఆఫీసర్ లిఫ్ట్ ప్రమాదంలో మృతి



తెలంగాణ ఎలివేటర్స్, ఎస్కలేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ నర్సింహారావు చెప్పిన ప్రకారం.. చాలా అపార్ట్‌మెంట్లలో ట్రాన్స్‌ఫార్మర్లు లేకుండానే లిఫ్ట్‌లు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో లో వోల్టేజ్ కారణంగా లిఫ్ట్ ప్రమాదాలకు ఎక్కువ అవకాశం ఉంది.

చాలామంది లిఫ్ట్ మెకానిక్స్ లేకుండానే లిఫ్టులను నిర్వహిస్తున్నారు. ఫలితంగా సరైన నిర్వహణ ఉండడం లేదు.ఈ రెండు సమస్యలు ప్రమాదాలకు మూలకారణాలుగా మారుతున్నాయి. వీటితోపాటు లిఫ్ట్ సామర్థ్యాన్ని పట్టించుకోకుండా భవన యజమానులు లిఫ్టులను మరీ ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల మోటార్, మిగిలిన పరికరాలపై ఒత్తిడి పెరిగి యంత్రాలు నిలిచిపోతున్నాయి. ఫలితంగా ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోంది. సందర్భాల్లో వాచ్‌మెన్‌లు, అటెండర్ల నిర్లక్ష్యం వల్ల కూడా లిఫ్ట్ ప్రమాదాలు జరుగుతున్నాయి. సదరు లిఫ్ట్‌లు తగిన నిబంధనలు పాటించకుండా ఉపయోగించడమే కాకుండా, మెకానిక్‌ల సరైన నిర్వహణ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.2015లో డ్రాఫ్ట్ బిల్లుగా సిద్ధమైన లిఫ్ట్ చట్టం ఇప్పటికీ అధికారికంగా అమల్లోకి రాలేదు. ప్రస్తుతం ఆఖరి దశలో ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నా, దీనిపై స్పష్టమైన విధివిధానాలు ఇంకా అందుబాటులోకి రాలేదు. లిఫ్ట్ చట్టం అమల్లోకి వస్తే..లిఫ్ట్‌లు ఏర్పాటు చేసుకుంటున్నప్పుడు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి అవుతుంది.సరఫరాదారులకు లైసెన్సింగ్ విధానం అమలవుతుంది. నాణ్యమైన, భద్రత కలిగిన లిఫ్ట్‌లనే ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో లిఫ్ట్ చట్టాన్ని వెంటనే అమలులోకి తేవాలని, ప్రతీ భవన యజమాని లిఫ్ట్ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

# నవ్వడం నలభై విధాల మేలు

## - ఆరోగ్యం, ఆనందాన్నిచ్చే హాస్యాన్ని అందరూ ఆస్వాదించాలి -దుర్గా నగర్ కాలనీ హాస్యప్రియులు

## - ఖనిలో ఘనంగా జరిగిన నవ్వుల దినోత్సవ వేడుకలు -కామెడీ స్కిట్స్ తో అలరించిన స్మైల్ ప్లీజ్ సభ్యులు.



గోదావరిఖని: నాడు నవ్వు నాలుగు విధాల చేటని అనే వారని, కానీ నేడు నవ్వడం నలభై విధాల మేలని, ఆరోగ్యంతోపాటు ఆనందాన్నిచ్చే హాస్యాన్ని అందరూ ఆస్వాదించాలనీ దుర్గా నగర్ కాలనీ హాస్యప్రియులు అన్నారు. ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా గోదావరిఖని దుర్గానగర్ కాలనీ అభివృద్ధి కమిటి ఆధ్వర్యంలో స్థానిక స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ బృందం ఆదివారం రాత్రి 'హాస్య వల్లరి' కార్యక్రమంలో అందరినీ కడుపుబ్బా నవ్వించారు. ఈ సందర్భంగా దుర్గా నగర్ కాలనీ కమిటీ, స్మైల్ ప్లీజ్ లాఫింగ్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో మనిషికి మనిషికి మధ్య బాంధవ్యాలతో పాటు.. అందరూ ఒకచోట చేరి నవ్వడం కూడా కరువైందన్నారు. మొబైల్ ఫోన్లకు పూర్తిగా బానిసగామారి ఎదురెదురుగా ఉన్నా ఒకరినొకరు మాట్లాడుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వ కాలంలో మన జీవన నడవడికతోనే హాస్యం పండేదని.. కానీ ఇప్పుడు సాటి మనిషి ఎదురైనప్పుడు పొడి పొడి మాటల పలకరింపుల పదాలతో నిత్యజీవితంలో హాస్యమే కరువైందని చెప్పుకొచ్చారు. ఇక్కడ హాస్యాన్ని అందరికీ పంచాలని స్మైల్ ప్లీజ్ లాంటి సంస్థలు ముందుకు వచ్చి లాఫింగ్ క్లబ్ ను ఏర్పాటు చేసి ప్రజలను హాస్యం వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారని, వారికి అందరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం స్మైల్ ప్లీజ్ అధ్యక్ష కార్యదర్శులు మేజిక్ రాజా, చంద్రపాల్, సభ్యులు కాసిపాక రాజమౌళి, తాళ్లపల్లి నారాయణ, మేజిక్ హరి ప్రదర్శించిన కామెడీ స్కిట్స్, సిహెచ్ ఉపేందర్ జోక్స్ సభికులను కడుపుబ్బ నవ్వించాయి. అంతకుముందు స్థానిక దుర్గా నగర్ లోని సర్వేశ్ డ్యాన్స్ ఇన్స్టిట్యూట్లో ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాలలో లాఫింగ్ క్లబ్ సభ్యులు, గోదావరిఖని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పందిళ్ళ శ్యామ్ సుందర్, సీనియర్ పాత్రికేయులు దయానంద్ గాంధీ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, పొన్నం విజయ్ కుమార్ గౌడ్, మొగరం గట్టయ్య, బంగారి మల్లేష్, జంగపల్లి పోషం, దుర్గా నగర్ లేఔట్ కాలనీ గౌరవాధ్యక్షులు పీఎస్ అమరేందర్, అధ్యక్ష కార్యదర్శులు తూముల రాజేశ్వర్ రావు, జక్కుల నారాయణ, కోశాధికారి పోకల ఆంజనేయులు, కొల్లూరి శ్రీనివాస్, బుచ్చి రెడ్డి, కంది రవీందర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సత్యనారాయణ రావు, నాగేశ్వరరావు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షం... అరటి రైతులకు మిగిల్చిన దుఃఖం

తాడేపల్లి : ఏముంది...ఇంక వారం రోజుల్లో పంట చేతికొస్తుంది...సాగు కోసం చేసిన అప్పులు తీర్చి, మిగిలిన వాటిని కుటుంబ అవసరాల కోసం వాడుకోవచ్చు అనుకున్నారు ఆ రైతులు ఇంకొందరు చేతి కొచ్చిన పంటను ఇప్పటికే అమ్మేశారు. కొనుగోలుదారులు కోసుకుని వెళ్లడమే ఇంతలో ఆదివారం ఉదయం వచ్చిన అకాల వర్షం, ఈదురు గాలులు, ఉండవల్లి మరియు పరిసర ప్రాంత రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఒక్కసారిగా తమ అంచనాలు తలకిందులు అవడంతో, ఆ రైతులకు మిగిలింది కొండంత దుఃఖమే అకాల వర్షానికి దెబ్బ తిన్న కరెంట్ స్తంభాలు, తెగి పడిన విద్యుత్ వైర్లు, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసేశారు. అలాగే ఇంటి పైకప్పులు దెబ్బతిని నష్టపోయిన బాధితులకు ఆర్థిక సాయాలు అందజేశారు. మరి ఈ రైతులు పరిస్థితి ఏంటి...??? వీళ్ళని ఆదుకొనేదెప్పుడు...!!!ఎవరు..ఎప్పుడొచ్చి సాయం చేస్తారా... అని ఎదురు చూపులు మిగిలాయి.మనం మంత్రి లోకేష్ నియోజకవర్గంలో ఉన్నాం అని...ఆయన పట్టించుకుంటారు...అని కొండంత ఆశ తో ఎదురు చూస్తున్నామని చెమర్చిన కళ్ళతో రైతులు తమ బాధను వెళ్లబోసుకుంటున్నారు

## ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి : నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో తప్పులు సరిదిద్దుకోవడం కోసం మరియు కొత్త ఆధార్ నమోదు 5 నుండి 8వ తేదీ వరకు, అలాగే 12 నుండి 15 వ తేదీ వరకు 12 సచివాలయాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. దొడ్డాపురం వీధి-01, ఐ.ఎస్ మహల్ రోడ్-02, జర్నలిస్ట్‌కాలనీ-01, కెనడీ నగర్-01, మధురానగర్-1,2, పోస్టల్ కాలనీ-04, ప్రకాశంరోడ్-02, రాజీవ్ నగర్ జీవకోన-06, శంకర్ కాలనీ -01, రేణిగుంట రోడ్-1, రాజీవ్ నగర్ జీవకోన-03, చెన్నారెడ్డి కాలనీ -03 నందు ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఆ ప్రకటనలో కోరారు.

### కడప ఎమ్మెల్యే కార్యాలయం సాక్షి పేపర్ పై

## ఎమ్మెల్యే మాధవి రెడ్డి హాట్ కామెంట్స్

కడప : సాక్షి పేపర్ పైన వైసీపీ నాయకుల పైన చర్యలను తీసుకునేందుకు ఎంతవరకు అయినా వెళ్తానని ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు.కల్వర్టు పైన కబ్జాలతో వైసిపి నాయకులు పైన చర్యలను తప్పకుండా తీసుకుంటామనీ తెలిపిన ఎమ్మెల్యే మాధవి రెడ్డి ... సాక్షి పేపర్ అమ్మడు పోకుంటే సాక్షి పేపర్ పై నా ఫోటోను వేసుకోనే అనుమతిని ఇస్తానని ఎమ్మెల్యే మాధవి రెడ్డి తెలిపారు.నగరంలో బ్రిడ్జిలను రద్దు చేసింది రాష్ట్ర ప్రభుత్వం... కడప ఎమ్మెల్యేగా నా బాధ్యత కాదని అన్నారు.రద్దు చేసిన బ్రిడ్జిలను అప్రూవల్ చేయడానికి ఎంతో కృషి చేశామన్నారు. పాత కడప చెరువును ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేశారని సాక్షి పేపర్లో రావడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు.

## పార్కులన్నీ ఆధునీకరిస్తాం

నెల్లూరు : ఐదేళ్ల పాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ సర్కార్ పార్కుల అభివృద్ధిని పూర్తిగా అటకెక్కించిందని పట్టణ, పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరులో తిక్కన పార్క్‌లో ప్లే, జిమ్ ఎక్విప్‌మెంట్‌ను ప్రారంభించారు. 2018లోనే 100 పార్కుల అభివృద్ధికి శ్రీకారం చుట్టామని.. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం పార్కుల అభివృద్ధిని అటకెక్కించిందని కామెంట్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, పిల్లల ఆహ్లాదం కోసం పార్కులను ఆధునీకరిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని పార్కులన్నీ ఆధునీకరించి సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ అన్నారు.

## ఓవర్ హెడ్ ట్యాంక్ పంప్ హౌస్ ను ప్రారంభించిన కలెక్టర్

తిరుపతి : తిరుపతి రూరల్ మండలం పరిధిలోని గాంధీపురం పంచాయతీలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పునరుద్ధరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ,చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి పాల్గొన్నారు.గాంధీపురం పంచాయతీలోని ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ వద్ద పంప్ హౌస్ ను ప్రారంభించారు.గత కొన్ని సంవత్సరాలుగా నీటి సమస్య ఉన్నా గత వైసిపి పాలకులు పట్టించు కోలేదన్న స్థానికులు... కూటమి ప్రభుత్వం వచ్చిన నప్పటినుండి ప్రజా సమస్యలు తీరుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఎమ్మెల్యే చొరవతో ఆరు పంచాయతీలలో త్రాగునీటి సమస్యకు పరిష్కారం అయింది.

### పదవీ విరమణ చేపట్టి స్వస్థలానికి వచ్చిన దేశ సైనికుడు

## వకులభరణం శ్రీధర్ కి ఘన స్వాగతం

### - ఘనంగా సన్మానించిన వెంకటేశ్వర కాలనీవాసులు

తిమ్మాపూర్ : అలుగునూర్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన వకులభరణం శ్రీధర్ భారత ఆర్మీలో 26 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పనిచేసి పదవి విరమణ చేసి స్వస్థలానికి వచ్చిన నేపథ్యంలో కాలనీవాసులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర కాలనీ వాసులు ముందుగా టపాసులు పేల్చిశ్రీధర్ దంపతులకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందించి, కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ దేశ సేవకు అంకితమై భారత సైన్యంలో 26 సంవత్సరాలుగా నాయక్, సుబేదార్ గా వివిధ రాష్ట్రాలలో జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హర్యానా, ఈశాన రాష్ట్రాలతో విధులు నిర్వహించినట్లు తెలిపారు. దేశ రక్షణ కోసం ఇన్నేళ్లుగా వివిధ హోదాల్లో ఆయా ప్రాంతాల్లో పనిచేయడం అదృష్టంగా, గర్వంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన, మాజీ ఆర్మీ సైనికుడిగా దేశ రక్షణ కోసం తన వంతు సేవ చేయడానికి ఎప్పుడు సిద్ధమేనని శ్రీధర్ అన్నారు. ఇట్టి కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ ప్రజలు, మాజీ సైనికుడు శ్రీధర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పొనుగోటి హాస్పిటల్ ను తనిఖీ చేసిన డాక్టర్ బి రవి రాథోడ్

### - ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం

మహబూబాబాద్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ మరియు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సారంగం ఆధ్వర్యంలో మహబూబాబాద్ పట్టణంలోని పొనుగోటి హాస్పిటల్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ ప్రతి హాస్పిటల్ మేనేజ్మెంట్ వారు అంధించు సేవలకు సంభంధించిన రుసుముల పట్టికను ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీకి సంభందించిన పరికరాలను అమర్చు కోవాలని, బయో మెడికల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ వారు ఇచ్చే సర్టిఫికేట్ లను విధిగా తీసుకోవాలని పేరుకొన్నారు. స్కానింగ్ సెంటర్లలలో లింగ నిర్ధారణ పరీక్షలు అనుమతి పొందిన రేడియాలజిస్టులు లేదా గైనకాలజిస్ట్ లు మాత్రమే గర్భవతులకు స్కానింగ్ చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన తర్వాత ఆడ, మగ అని తెలుపుట చట్టరీత్యా నేరమని పేర్కొంటూ , అన్ని స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసే గదిలో మరియు వేచి యుండు హాలులో తప్పకుండా ఇక్కడ లింగ నిర్ధారణ చెప్పబడదు అనే బోర్డు పెట్టాల్సిందిగా హాస్పిటల్ యాజమాన్యానికి ఆదేశించడం జరిగిందని అన్నారు. ఫామ్ -ఎఫ్ , ఏ రోజువి ఆ రోజే ఆన్లైన్ చేయాలని, ఆన్లైన్ చేసిన అన్ని ఫారం బిఎఫ్, లు అన్నీ ప్రతినెల5వ తారీఖు లోపుజిల్లా వైద్య' ఆరోగ్య శాఖా కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. ఈ తనికీ లో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సారంగం, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, సి సి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళలను

# భవిష్యత్ తరాలకు అందిస్తున్న టిటిడి

సాంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పకళను సంరక్షించడంతోపాటు భవిష్యత్ తరాలకు అందించేందుకు టిటిడి విశేష కృషి చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిటిడి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పశిక్షణ సంస్థ ఏకైక సంస్థగా పేరొందింది. భారతీయ సాంప్రదాయ ఆలయ శిల్పకళ మరియు ఆలయ నిర్మాణ రంగంలో నైపుణ్యం గల వ్యక్తులను శిక్షణ ఇస్తున్న ఒక ప్రత్యేక సంస్థ. భారతీయ సంస్కృతి మరియు వారసత్వానికి దిశా నిర్దేశకులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ సంస్థ సహాయపడుతుంది. ఈ సంస్థ ఆలయ నిర్మాణ శిల్పకళ, వాస్తుశిల్పం మరియు దీనికి సంబంధించిన కళా రూపాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది. 1960వ సంవత్సరంలో స్థాపించి శిల్పశాస్త్రాల ప్రకారం విద్యార్థులకు టిటిడి శిక్షణ ఇస్తోంది.

**కోర్సులు**

**డిప్లొమా ఇన్ ట్రెడిషనల్ స్కల్ప్చర్ కోర్సు**

రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ, ఏపీ మరియు ఏఐసిటిఈ, న్యూఢిల్లీ వారి అనుమతి పొందింది. ఈ కోర్సు 4 సంవత్సరాల కాలపరిమితితో 6 విభాగాలు ఉండగా, అందులో 1. ఆలయ నిర్మాణ విభాగం 2. శిలా శిల్ప విభాగము, 3. సుధా శిల్ప విభాగము, 4. లోహ శిల్ప విభాగము, 5. కొయ్య శిల్ప విభాగము, 6. సంప్రదాయ వర్ణచిత్ర లేఖన విభాగములు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఒక్కొక్క విభాగంలో పది మంది విద్యార్థినీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశము కలదు. మొత్తం ఆరు విభాగాలలో 60 మంది విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశము కల్పించబడుతుంది. డిప్లొమా కోర్సులో చేరే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించబడుతుంది. నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆలయ నిర్మాణ శిల్పకళా విజ్ఞానం కొరకు దక్షిణ భారతదేశంలోని ప్రముఖ చారిత్రక ఆలయాల సందర్శనకు ఉచితంగా పంపబడును. శిలా శిల్పంలో ఉత్తీర్ణులైన వారికి విస్తృతంగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి.

**సంప్రదాయ కలంకారి కళ ( సర్టిఫికెట్ కోర్సు)**

వస్త్రాలపై కలంకారికళ చిత్రరచనా విధానంపై 2 సంవత్సరాల సర్టిఫికేట్ కోర్సు ఉంది. కలంకారి కళలో పదవ తరగతి పాసైన వారు ప్రతి సంవత్సరం 10 మంది విద్యార్థులకు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చు. ప్రవేశం పొందిన విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా వసతి, భోజనం కల్పించబడును. కలంకారి కోర్సు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు స్వయం ఉపాధిని పొందవచ్చు. దేశ విదేశాలలో కలంకారి కళకు మంచి ఆదరణ ఉంది.

**ప్రవేశం**

రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అనుసరించి ప్రతి సంవత్సరం మే లేదా జూన్ నెలలో ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థినీ విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. 2025 – 26 సంవత్సరానికి మే 5 నుండి జూన్ 20వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా మరియు సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశం పొందిన విద్యార్థినీ విద్యార్థుల పేరిట, తిరుమల తిరుపతి దేవస్థానంవారు రూ. 1 లక్ష జాతీయ బ్యాంకులో డిపాజిట్ చేస్తారు. యాజమాన్యం వారి నియమావళి ప్రకారం ఈ కళలో స్థిరపడుటకు మరియు వారిని ప్రోత్సహించుటకు వడ్డీతో సహా కలిపి ఈ నగదు ఇవ్వబడును.

**ఉపాధి అవకాశాలు**

ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులు ఇదే సంస్థలో ఉపాధ్యాయులుగా, తితిదే రినోవేషన్ విభాగంలో స్థపతులుగా, టెక్నికల్ అసిస్టెంట్లుగా, కాంట్రాక్టర్లుగా అవకాశాలు పొందుతున్నారు. అంతేగాక ప్రభుత్వ శాఖలైన దేవాదాయ, ధర్మాదాయ శాఖ, పర్యాటక శాఖ, పురావస్తు పరిశోధనా శాఖల్లో పనిచేస్తూ అనేక జాతీయ సంస్థల నుండి అవార్డులు కూడా సాధిస్తున్నారు. శిల్పశిక్షణ సంస్థకు అనుబంధంగా ఉన్న శిలా శిల్ప ఉత్పత్తి విభాగంలో కొందరు విద్యార్థులు కాంట్రాక్ట్ పద్ధతిన దేవతామూర్తుల ప్రతిమలను తయారు చేస్తున్నారు.

**ఇతర వివరాలకు**

శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్పశిక్షణ సంస్థ,
తిరుమల తిరుపతి దేవస్థానములు
అలిపిరి రోడ్, తిరుపతి – 517507. తిరుపతి జిల్లా
ఆఫీస్ ఫోన్ నెంబర్ – 0877 – 2264637

# కులగణనను వ్యతిరేకించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ : కుల గణన నిర్వహించాలని ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాయి. అయితే కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలతో పాటు కుల గణన చేపడతామని ఇటీవల స్పష్టం చేసింది. కుల గణనకు సంబంధించి రాహుల్ గాంధీ సహా కాంగ్రెస్ నేతలు ఇది తమ విజయమని చెబుతున్నారు. అయితే 'సంవిధాన్ బచావో ర్యాలీ' సందర్భంగా కుల గణనను కేంద్రం జాప్యం చేయకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆర్టికల్ 15 (5) ను అమలు చేయాలని గత వారం అచిఅ సమావేశంలో చేసిన డిమాండ్లను లేవనెత్తాలని ంఎఅఅ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ విభాగాలను ఆదేశించారు.రాహుల్ గాంధీ చేసిన కృషి, పోరాటంతోనే కేంద్ర ప్రభుత్వం కుల గణనకు నిర్ణయం తీసుకుందని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వేణుగోపాల్ అన్ని రాష్ట్రాల కాంగ్రెస్ నేతలకు సూచించారు. కానీ గతంలో న్యాయ మంత్రిత్వ శాఖ కుల గణన చేపట్టాలని యూపీఏ హయాంలో సూచించగా అప్పటి కాంగ్రెస్ పార్టీ దాన్ని వ్యతిరేకించినట్లు సమాచారం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దశబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నది. ఆ సమయంలో సమగ్ర కుల గణనను నిర్వహించని కారణంగానే దేశంలో కీలకమైన డేటా అందుబాటులో లేకుండా పోయిందని ఆరోపణలున్నాయి. కుల గణనతో ఇతర వెనుకబడిన తరగతులు , జనరల్ కేటగిరీతో సహా అన్ని కులాల జనాభా లెక్కలతో పాటు వారి ఆర్థిక స్థితిగతుల గురించి కీలకమైన సమాచారం లభిస్తుంది. కానీ కాంగ్రెస్ పలు రాజకీయ కారణాల వల్ల కుల గణనను విస్మరించింది.

కుల గణనపై గతంలో కాంగ్రెస్..

స్వాతంత్ర్యంవచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ జనాభా లెక్కలు చేసింది. కానీ కుల జనాభా గణన డిమాండ్‌ను విస్మరించింది. దాంతో కులాల వారిగా జనాభాపై డేటా అందుబాటులో లేదు. పలు రాజకీయ, సామాజిక కారణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం, యూపీఏ ప్రభుత్వాలు కుల గణన చేటప్టలేదని రిపోర్టులు చెబుతున్నాయి.

1931: భారత్‌లో చివరిసారిగా కుల గణన చేపట్టారు. ాఃఅలతో సహా అన్ని కులాల లెక్కలు తేల్చారు. అప్పటి నుండి, జనాభా లెక్కల్లో ాఅ (షెడ్యూల్డ్ కులాలు), ాు (షెడ్యూల్డ్ తెగలు) కు సంబంధించిన డేటా మాత్రమే అందుబాటులో ఉంది. సామాజిక న్యాయం, రిజర్వేషన్లకు, సంక్షేమ పథకాలకు కులాల జనాభా లెక్కలు చాలా ముఖ్యం.

దశాబ్దాలుగా కాంగ్రెస్ ఏం చేసింది..

1. 1947-1989: కాంగ్రెస్ ఆధిపత్యం కారణంగా కులాల వారీగా జనాభా లెక్కలు తేల్చలేదు. స్వాతంత్ర్యం పొందినప్పటి నుంచి 1989 వరకు దాదాపు కాంగ్రెస్ ఏకపక్షంగా పాలించింది. దాంతో ప్రధాన ప్రతిపక్షం లేని కారణంగా కుల గణన డిమాండ్ అంతగా రాలేదు. దాంతో కుల గణన చేపట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడూ చొరవ తీసుకోలేదు.పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నుంచి రాజీవ్ గాంధీ ప్రభుత్వాలు కుల గణనను విస్మరించాయి. దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు విభజన శక్తిగా భావించాయి. కులం కారణంగా సామాజిక విచ్ఛిన్నతకు దారితీస్తుందని భావించారు.1990 దశకం: మండల్ కమిషన్ సిఫార్సులు, మరోవైపు కాంగ్రెస్ సైలెంట్

వి.పి. సింగ్ ప్రభుత్వం 1990లో మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేసింది. దాంతో ాఃఅలకు రిజర్వేషన్లు లభించాయి. కాంగ్రెస్ దానిని వ్యతిరేకించలేదు. తెలివిగా కుల గణన డిమాండ్ చేయకుండా మౌనం వహించింది. ఈ అంశాన్ని తన ప్రధాన ఎజెండాలో చేర్చలేదు. 2011: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సామాజిక, ఆర్థిక సర్వే

యూపీఏ 2 హయాంలో మన్మోహన్ సింగ్ నేతృత్వం 2011లో సామాజిక- ఆర్థిక, కుల గణన నిర్వహించింది. దాదాపు 80 ఏళ్ల తర్వాత మళ్ళీ కులాల వారీగా జనాభా లెక్కల సేకరణకు ఇది బీజం వేసింది. ఆ సర్వేలో లెక్కలు సేకరించారు. కానీ అది అస్తవ్యస్తంగా, అసంపూర్ణంగా, వివాదాస్పదంగా మారింది. దేశంలో 46 లక్షలకు పైగా కులాలు ఉన్నాయని.. ఒకే కులం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తీరుగా ఉందని సర్వేలో పేర్కొన్నారు. అందుకే ప్రభుత్వం ఈ లెక్కలు వెల్లడించలేదు. 2015లో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో, కుల ఆధారిత డేటా బదులుగా.. సామాజిక-ఆర్థిక డేటా మాత్రమే ప్రచురించారు.

2014- 2020: ఏ డిమాండ్ లేదు..

కాంగ్రెస్ 2014లో అధికారం కోల్పోయింది. ప్రతిపక్షంలో ఉన్నా కూడా, కుల గణనకు సంబంధించి ఏ డిమాండ్ చేయలేదు. దానిపై స్పష్టమైన విధానం సైతం లేదు.

2021 నుంచి నేటికి....

2021 నుంచి కాంగ్రెస్ వైఖరి మారింది. ప్రాంతీయ పార్టీలు ఎస్పీ, డీఎంకే, ఆర్జేడీ, జేడీయూ,కుల గణనను డిమాండ్ చేయడంతో క్రమంగా కాంగ్రెస్ సైతం కుల గణనకు డిమాండ్ చేసింది. గత ఏడాది ఎన్నికల సమయంలో కాంగ్రెస్ దీన్ని తమ ఆయుధంగా వాడుకోవాలని చూసింది. తాము అధికారంలోకి వస్తే సామాజిక న్యాయం కోసం "కుల ఆధారిత జనాభా గణన" అవసరమని రాహుల్ గాంధీ అన్నారు. జనాభా ప్రాతిపదికన హక్కులు, అవకాశాలు అని చెప్పారు.

రాజకీయ, ఓటు బ్యాంకు కారణాలతో మౌనమా..

కుల జనాభా లెక్కల డేటా సమాజంలో వర్గ విభజన చేసి బ్రహ్మణ, వైశ్యులు సహా అగ్ర కులాల ఓటు బ్యాంకు దూరమవుతుందని భావించారు. కుల గణన డేటా సామాజిక విభజనతో కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుందని భావించడం. ాఃఅల రాజకీయాల్లో కాంగ్రెస్ స్పష్టమైన విధానాన్ని పాటించలేదు. ఈ విషయంపై వారికి ఎలాంటి విధానం లేకపోయింది. వనరుల కొరత, డేటా నాణ్యత లాంటివి సాకుగా చూపుతూ కుల గణన జోలికి వెళ్లలేదు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల మాట్లాడుతూ, "90 శాతం మంది ప్రజలు వ్యవస్థకు బయట ఉన్నారు.

వారికి టాలెంట్ ఉన్నా అవకాశాలు రావడం లేదు. అందుకే, కుల గణన చేపట్టి అందరికీ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. మండల్ కమిషన్ సూచనల తరువాత దేశంలో కుల గణనపై ఆసక్తి నెలకొంది. ఆర్జేడీ, జేడీయూ, డీఎంకే లాంటి పార్టీలు ఇదే ఆలోచన చేయగా.. కాంగ్రెస్ వారికి మద్దతు ఇచ్చింది.

యూపీఏ హయాంలో కులాల లెక్కలు వెల్లడి కాలేదు

యూపీఏ 2 హయాంలో 2011-2012లో సామాజిక-ఆర్థిక, కుల గణన (ాఇఅఅ) నిర్వహించింది. దేశ వ్యాప్తంగా లెక్కలు తీసినా ప్రభుత్వం కులాల వారీగా జనాభా వివరాలను బహిర్గతం చేయలేదు. 2012లో సర్వే చేయగా, 2013లో డేటా రెడీ చేశారు. ఎన్నికల్లో నెగ్గాక డేటా విడుదల చేయాలనుకోగా.. 2014లో అధికారం కోల్పోవడంతో కులాల లెక్కలు బహిర్గతం కాలేదు.

## దేవాలయ మాన్యపు భూములను పరిరక్షించండి

సి.బెళగల్ : సి.బెళగల్ మండలం బ్రాహ్మణ దొడ్డి మజార గ్రామమైన మారం దొడ్డి గ్రామం నందు పురాతనం నుండి ఆలయములకు మాన్యపు భూములు కలవు. గ్రామంలోని ఆంజనేయస్వామికి 24 ఎకరాలు, శివాలయమునకు 24 ఎకరాలు, చెన్నకేశవ స్వామి కి 28 ఎకరాల మాన్యపు భూములు కలవని, ఈ భూములకు కొన్నిచోట్ల సరిహద్దులు అన్యక్రాంతమునకు గురి అయ్యాయని, కావున మా మీద దయవుంచి మారందొడ్డి గ్రామంలో జరగబోయే రీసర్వే నందు సర్వే నంబర్ 474లో 13 ఎకరాల 75 సెంట్లు, సర్వే నంబర్243, 2ఎలో 7 ఏకరాల 65 సెంట్లు, సర్వే నంబర్ 243,2బి లో 5ఎకరాల 16 సెంట్లు, సర్వే నంబర్ 18, 30లో 7ఎకరాల 44 సెంట్లు సదరు వ్యవసాయ భూమికి సంబంధించిన సరిహద్దులు ఏర్పాటు చేయాలని మారందొడ్డి గ్రామస్తులు సోమవారం తహసిల్దార్ పురుషోత్తము డుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మారందొడ్డి గ్రామస్తులు రుక్మండ, పాండు, రాఘవేంద్ర, సోమన్న, విక్రమార్కుడు తదితరులు ఉన్నారు.

## వైసీపీ నేతలతో జగన్ టెలికాన్ఫరెన్స్

అమరావతి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైకాపా నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన రైతులను వైసీపీ నేతలు పరామర్శించాలి. వర్షాలపై సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం విఫలమైంది. ఖరీఫ్లో ప్రతికూల వాతావరణం వుంది. మద్దతు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు అకాల వర్షాలతో మరింత నష్టపోయారు. కష్టాల్లో ఉన్న రైతులకు అండగా నిలవాలి. రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అయన అన్నారు.

## కావాలనే కేశినేని నాని పసలేని ఆరోపణలు

అమరావతి : కేశినేని నాని కావాలనే పసలేని ఆరోపణలు చేస్తున్నారు నానికి సత్తా ఉంటే నాకు, కేసిరెడ్డి మధ్య ఆర్థికలావాదేవీలు నిరూపించాలని ఎంపి కేశినేని చిన్ని అన్నారు. మా సంస్థ సరిహద్దులో కేసిరెడ్డి సంస్థ ఉండేది.. 2021లో ఉమ్మడిగా ఫ్రైడ్‌న్యూ రిజిస్టర్ చేశాం. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాక దూరమయ్యాం.. అమెరికా, దుబాయ్ కంపెనీలు అంటూ ఆరోపిస్తున్నారు. అమెరికా దుబాయ్ కంపెనీలంటూ నాని సృష్టించిన ఫేక్ కంపెనీలు.. నిజమో కాదో ఆయన్నే నిరూపించమనండి. జగన్కు గూఢచారిగా పనిచేసిన వ్యక్తి నాని.. కేశినేని నాని నీతిమాలిన ఆరోపణలకు స్పందించాల్సిన అవసరం లేదు. ఫేక్ కంపెనీలను నిరూపించాల్సిన బాధ్యత నానిదే.. లేకపోతే ఉత్తరాల పేరుతో చెత్తను కట్టిపెట్టాలని అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా ఫోరెన్సిక్ వారోత్సవాలు

అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా ఫోరెన్సిక్ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఏడీజీపీ మధుసూధన్ రెడ్డి అన్నారు. ఫోరెన్సిక్ విభాగంలో ఇన్వెస్టిగేషన్ పై అధునాధతన పద్ధతి పై అవగాహన కల్పిస్తున్నాం. ఫోరెన్సిక్ లో కొత్త టెక్నాలజీ ద్వారా రిపోర్ట్స్ అన్ని నేరుగా న్యాయ స్థానం కే పంపేలా చర్యలు చేపడుతున్నాం. ఇన్వెస్టిగేషన్ అధునాతన పద్ధతులు ద్వారా నిందితులకు శిక్షలు పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఐజీ ఫోరెన్సిక్ పాల్ రాజు మాట్లాడుతూ ఈ నెల 5 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు ఫోరెన్సిక్ వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఏదైనా కేసుల్లో నిందితులకు శిక్ష లు న్యాయస్థానంలో సరైన ఎవిడెన్స్ ఉండాలి. ఇందులో ఫోరెన్సిక్ విభాగం ఎంతో కీలకం. ఫోరెన్సిక్ లో సరైన ఆధారాలు ఎంతో అవసరం. ఫోరెన్సిక్ లో ఆధునిక పద్ధతుల పై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నాం. ఆర్టిఫీషియల్ వంటి సాంకేతిక విధానాలను కూడా ఎఫ్ ఎస్ ఎల్ లో ఉపయోగిస్తున్నాం. అతి త్వరగతిన ఎఫ్ ఎస్ ఎల్ టిమ్ లు ఘటనా స్థలానికి చేరుకునేలా మానిటరింగ్ చేస్తున్నాం. సిన్ ఆఫ్ అఫెన్స్ లో అన్ని ఆధారాలు డిజిటల్ ఫార్మెట్ లో సేకరించేలా చూస్తున్నామని అన్నారు.

## వాంబే ఇళ్లపై జేసీబీలు పంపిన కార్పోరేటర్

అమరావతి : వాంబే స్కీం పేదల ఇళ్లపై పబ్లిసిటీ కార్పొరేటర్ పీతల మూర్తి ప్రతాపం చూపించారు. ఒక్కో ఇంటి వారు తనను ప్రసన్నం చేసుకోవాలని డిమాండ్ చేసారు. ప్రసన్నం చేసుకోకపోతే గృహాలు కూల్చేస్తానని బెదిరింపులు. పితాపురం కాలనీలో 2014లో రజకులకు వాంబే గృహాలు ఇచ్చారు.అప్పుడు తాను అధికారంలో లేనని ఇప్పుడు తనకు చూడాల్సిందేనని డిమాండ్ చేసారు. ఇప్పటికే జెసిబి తో టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించి గోడ కూల్చి కార్పొరేటర్ బెదిరించారు. బాధితులు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని అడ్డుకున్నారు. కార్పొరేటర్కు సాటిస్ ఫై చేస్తేనే కూల్చివేతలు ఆగుతాయని టౌన్ ప్లానింగ్ సిబ్బంది సమాధానిమిస్తున్నారు.

## ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ భేటీ

న్యూ డిల్లీ : పెహల్‌గామ్ ఉగ్రదాడితో దేశం మొత్తం ఆగ్రహంతో ఊగిపోతోంది. దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ ఎలాంటి ప్రతీకార చర్య చేపడుతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఈ క్రమంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తో రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ సమావేశమయ్యారు. ప్రస్తుత పరిస్థితుల్లో మోదీతో రక్షణ శాఖ కార్యదర్శి భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇక నిన్న ప్రధానితో ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కూడా సమావేశమైన విషయం తెలిసిందే.భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ త్రివిధ దళాల అధిపతులతో ప్రధాని వరుసగా భేటీ అవుతున్న విషయం తెలిసిందే. ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీతో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. గత నెల 26న జరిగిన రక్షణ సంబంధిత ఉన్నత స్థాయి సమావేశంలో పాక్‌పై చర్యలు తీసుకొనే విషయంలో సాయుధ బలగాలకు మోదీ పూర్తి స్వేచ్ఛనిచ్చారు. మరోవైపు రక్షణ సన్నాహకాల్లో భాగంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డ్ తన ఉద్యోగులందరికీ సెలవులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## నా తమ్ముడికి లిక్కర్ నిందితులతో వ్యాపారాలు

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అనూహ్య ఘటనలు జరుగుతున్నాయి. ఏపీ ప్రభుత్వం లిక్కర్ స్కాంలో ప్రధాన నిందితుడిగా.. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని గుర్తించి అరెస్టు చేసింది. ఆయన కింగ్ పిన్ మాత్రమేనని ఈ స్కాంలో అసలు కింగ్ ఉన్నాడని ఆయనను పట్టుకునేందుకు దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో బయటకు వస్తున్న విషయాలు ఆసక్తికరంగా మారాయి. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డితో కలిసి.. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ..వ్యాపారాలు చేస్తున్నారని కేశినేని నాని బయట పెట్టారు. మాజీ ప్రభుత్వ సలహాదారు . ఇప్పుడు మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న కేశినేని రాజశేఖర్ రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్, అతని భార్య జానకి లక్ష్మి కేశినేనితో పాటు ప్రైడ్‌న్యూకాన్ ఒఒఖలో భాగస్వామిగా ఉన్నారు. ఈ కంపెనీ ప్లాట్ నంబర్ 9, సర్వే నంబర్ 403, జూబ్లీ హిల్స్, హైదరాబాద్ – 500033 అడ్రస్‌తో ఉంది. అలాగే ఇటీవల అరెస్టు అయిన కసిరెడ్డి సహాయకుడు దిలీప్ పైలా నిర్వహిస్తున్న ఏషాన్విన్యూ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీ కూడా ఇదే అడ్రస్ లో ఉంది. అంతే కాదు.. రెండు కంపెనీలకు ఒకే ఈమెయిల్ అడ్రస్ ఉపయోగిస్తున్నారని కేశినేని నాని చెబుతున్నారు.విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఆఫ్‌షోర్ కంపెనీలలో పెద్ద మొత్తంలో అక్రమంగా మళ్లించిన నిధులను పెట్టుబడి పెట్టారని కేశినేని నాని ఆరోపించారు. కేశినేని ఇంటర్నేషనల్ లిమిటెడ్, డెలావేర్, జూం, కేశినేని గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్, దుబాయ్, జంఇ కంపెనీల పేరుతో లెక్కల్లో చూపని సంపదను లాండరింగ్ చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. వాటిపై స్వతంత్ర, ఉన్నత స్థాయి దర్యాప్తుకు ఆదేశించాలని సీఎం చంద్రబాబును కోరారు. సిట్టింగ్ ఎంపీ , లిక్కర్ స్కామ్ లో అరెస్టు అయిన ఇద్దరు వ్యక్తులతో సన్నిహితంగా ఉంటారు. వ్యాపార భాగస్వాములుగా ఉన్నారు. మీ నాయకత్వంపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటానికి సమగ్రమైన, నిష్పాక్షికమైన దర్యాప్తు చేయించాలని డిమండ్ చేశారు. ఈ ఆరోపణలపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఇంకా స్పందించలేదు. గతంలో కేశినేని నాని తప్పుడు ఆరోపణలు చేశారని ఆయనకు నోటీసులు పంపించారు. ఇద్దరూ సోదరులే అయినప్పటికీ బయటకు తెలియని కారణాలతో వారు వ్యక్తిగత శత్రువులుగా మారారు.




## సమ్మె ప్రచార వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**వేద న్యూస్,ఎన్టీపీసీ,జ్యోతినగర్:**

దేశవ్యాప్తంగా మే 20న జరగబోయే కార్మిక సమ్మెకు మద్దతుగా, సీఐటీయూ అనుబంధ రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీపీసీ ప్లాంట్ గేట్-2 వద్ద సమ్మె ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు గిట్ల లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాంసాని శంకర్ మాట్లాడుతూ, కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలని అన్నారు.నాలుగు నూతన లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000గా అమలు చేయాలని, గత అగ్రిమెంట్ ప్రకారం ఎన్టీపీసీ యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు ప్రమోషన్ పాలసీని అమలు చేయాలని వారు కోరారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులు భాగస్వాములై సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలు ఏం. రామాచారి, దండ రాఘవరెడ్డి, టి. మల్లయ్య, కె. శ్రీనివాస్, బి. ప్రభాకర్, బి. వెంకటేష్, బి. అజయ్, పోచం, రహమత్ అలీ, రామ్ రెడ్డి, మోహన్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



## దళారులకు వరంగా మారిన సన్నవడ్లు

**వేద న్యూస్, కోదాడ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులు సన్నవరి సాగు చేసేందుకు బోనస్పథకం ప్రారంభిస్తే అది దళారులకు వరంగా మారింది. పక్క రాష్ట్రాలను నుంచి ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇక్కడ దర్జాగా అమ్మకాలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన లారీ రాకుండా పౌరసరఫరాల శాఖ సరిహద్దుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన తనిఖీలు చేపట్టిన దళారులు తమ వ్యాపారం సజావుగా సాగిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. అక్కడి ధాన్యం తెలంగాణ రావద్దని రైతులు ఆందోళన చేసిన ఒకటి రెండు రోజులు నిఘా పెట్టి అధికారులు తర్వాత పెద్దగా పట్టించుకోవడంలేదని ఆరోపణలు సైతం లేకపోలేదు. దళారుల కమిషన్లకు అధికారులు అలవాటుపడి ప్రభుత్వం ఖజనా పక్కదారి పట్టినా ఫర్వాలేదు కానీ తమ జేబులు నిండాలనే ఆలోచనతో ఉన్నట్లు రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



## విశ్వభారతి ఉపాధ్యాయులను అభినందించిన ఎమ్మెల్యే

**వేద న్యూస్,ఎన్టీపీసీ జ్యోతి నగర్:**

2025 ఎస్ఎస్‌సి ఫలితాల్లో రామగుండం-గోదావరిఖని ప్రాంతం లోని విశ్వభారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థలు అత్యద్భుత ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాయి. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజు ఠాకూర్ విశ్వభారతి విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను ప్రత్యేక కార్యక్రమంలో అభినందించారు.

ప్రముఖ విద్యార్థులు ఎం. జశ్వంత్ 582 మార్కులు, వి.చరణ్ 564, ఇ. రాజకుమార్ 559, టి.కావ్యా 558, జేఎల్. వర్ధన్ 556, బి. నాగధీరాజ్ 552 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. వీరంతా తమ ప్రతిభతో ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంగళవారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్, హెడ్మాస్టర్లు నోయల్ జోసెఫ్, తిరుపతి గౌడ్ లను రామగుండం ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, తక్కువ ఫీజులతో అత్యుత్తమ విద్యను అందిస్తూ ఈ ప్రాంత ఉపాధ్యాయులు విద్యారంగంలో ప్రాంత ప్రతిష్టను రాష్ట్రస్థాయిలో నిలబెట్టారని ప్రశంసించారు. విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం దోహదపడ్డాయని అన్నారు.ఈ విజయాలు స్థానిక విద్యా వ్యవస్థ స్థాయిని మరింతగా పెంచుతాయని, ప్రభుత్వ సహకారంతో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### సాయి నగర్ గుడిసె వాసులకు..

# ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తాం..

■ **మధుయాష్కీ గౌడ్**

**వేద న్యూస్, ఎల్బి నగర్ :**



అగ్ని ప్రమాదం ఘటనలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన నాగోల్ సాయి నగర్ గుడిసె వాసులకు ఇందిరమ్మ ఇంటి పథకం కింద పక్కా గృహాలను కట్టించి ఇస్తామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదం సంభవించి గుడిసెలు కాలిపోయిన నాగోల్ సాయి నగర్ కాలనీని మంగళవారం ఆయన సందర్శించారు. ప్రమాదంలో పేదల గుడిసెలు, ఇళ్లల్లోని బియ్యం, బట్టలు, పుస్తకాలు, గృహోపకరణాలు కాలి బూడిదైన తీరును చూసి చలించిపోయారు. కన్నీరుతో బాధితులు చెప్పిన ఆవేదనను విని వారిని ఓదార్చారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది అని భరోసా కల్పించారు. బాధితులకు న్యాయం చేసే విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సాయినగర్ గుడిసవాసులు అందరికీ ప్రభుత్వం అందిస్తున్న రూ. 5లక్షల ఆర్థిక సహాయంతో పక్కా ఇల్లు కట్టించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఇప్పటికే కలెక్టర్ తో మాట్లాడడం జరిగిందన్నారు. అంతేకాకుండా వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు రూ. 3వేల చొప్పున వ్యక్తిగతంగా తక్షణ సహాయాన్ని అందజేశారు. అంతే కాకుండా ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబాలకు రూ.6 వేలచొప్పున నగదు, బియ్యం అందించేలా ఇప్పటికే కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్ అంగీకరించారని పేర్కొన్నారు. కానీ రూ.12 వేల చొప్పున ఇవ్వాలని కలెక్టర్ తో మాట్లాడినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఇల్లు నిర్మించుకునేంతవరకు తలదాచుకునేందుకు అధికారులతో మాట్లాడి స్థానికంగా ఉన్న జిహెచ్ఎంసి వార్డు కార్యాలయంలో బస ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

సాయి నగర్ గుడిసెలలో 620 కుటుంబాలు నివాసం ఉంటున్నప్పటికీ, 450 మంది వరకే ఇళ్ల పట్టాలు ఉన్నాయని, వారితోపాటు మిగతా వారందరు కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని భరోసా ఇచ్చారు. తమ కుటుంబంలో అక్కాచెల్లెళ్లకు జరిగితే ఎలా బాధపడతామో.. ఇక్కడి మహిళల ఆవేదనా తనకు అంతే బాధ కలిగిస్తుందని.. ఇక్కడి గుడిసె వాసులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. పిల్లల పుస్తకాలు, రేషన్ ఆధార్ కార్డులు సర్టిఫికెట్లతో పాటు శుభకార్యాల కోసం కొన్న బట్టలు, బంగారం కూడా మంటల్లో కాలి బూడిదవడం ఎంతో ఆవేదన కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఎంపీ ఈటల రాజేందర్ తో కలిసి బాధితులతో మాట్లాడి భరోసా కల్పించారు. సిపిఐ నేతలు ఈటి నరసింహ, రవీంద్రాచారి, కే.చందు తదితర నాయకులు కూడా ఈ సందర్భంగా మధుయాష్కీని కలిసి బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంతో మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు మంజులా రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, కుట్ల నర్సింహ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, గణేష్ నాయక్, నాయకులు చెరుకు చిరంజీవి గౌడ్, భవాని శంకర్ గౌడ్, విజయపాల్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్, ఉరిపక్క రవి, గణేష్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కవిత తదితరులు ఉన్నారు.

## గర్ల్ ఎంపవర్‌మెంట్ ద్వారా బాలికల్లో లీడర్ లక్షణాలు

**వేద న్యూస్,ఎన్టీపీసీ జ్యోతి నగర్:**




గర్ల్ ఎంపవర్ మెంట్(బాలికల సాధికారత) కార్యక్రమం ద్వారా బాలికల్లో లీడర్ లక్షణాలు పెంపొందుతాయని రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చందన్ కుమార్ సమాంత అన్నారు.మంగళవారం ఎన్టీపీసీ టౌన్ షిప్ లోని కాకతీయ ఫంక్షన్ హాల్ లో గర్ల్ ఎంపవర్ మెంట్ మిషన్ జెమ్ (బాలికల సాధికారత) కార్యక్రమంను ఈడీ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కార్యక్రమంలో అనుభవజ్ఞులైన టీచర్ల ద్వారా బాలికలకు హిందీ ,ఇంగ్లీష్ (గ్రామర్, మాథ్స్, సైన్స్, కంప్యూటర్, లైఫ్ స్కిల్ ట్రైనింగ్, డ్యాన్స్, డ్రామా, ఆర్ట్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి వాటిలో శిక్షణ అందిస్తామని అన్నారు.విద్యతో పాటు నైతిక విలువలను,బాల్య వివాహాలు లైంగిక దాడులు ,లింగ వివక్షత,ఆరోగ్య సమస్యలపై అవగహన పెంచడానికి బాలకల సాధికరత కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.సంస్థ దత్త గ్రామాలలోని గవర్నమెంట్ స్కూలల్లో చదివే 120 మంది బాలికలను సెలక్టు చేసి 28 రోజుల పాటు ఎన్టీపీసీ సంస్థ, ఉచితంగా అన్ని సౌకర్యాలు కల్పించి శిక్షణ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో దీప్తి మహిళ సమితి అధ్యక్షురాలు రాఖీ సమాంత, ఉన్నత అధికారులు, ఉద్యోగులు,యూనియన్ సభ్యులు తది తరులు ఉన్నారు.

## డాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ జిల్లా కమిటీ సమావేశం

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



తెలంగాణ డాన్స్ స్పోర్ట్ అసోసియేషన్ నల్గొండ జిల్లా కమిటీ సమావేశంను మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించారు. పట్టణంలోని అసోసియేషన్ భవనము లో ఏర్పాటు చేసిన జిల్లా డాన్స్ మాస్టర్స్ సమావేశంలో తెలంగాణ స్పోర్ట్ జిల్లా అధ్యక్షుడు పాతన బోయిన శేఖర్,పట్టణ అధ్యక్షుడు అలుగుబెల్లి వెంకట్,జిల్లా కార్యదర్శి రాము మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో పనిచేస్తున్నటువంటి డాన్స్ మాస్టర్ లందరూ ఐక్యమత్తంగా ఉండాలని జిల్లాల వారీగా అసోసియేషన్ ఏర్పాటు చేయడం ద్వారా ఏ జిల్లా వారు,ఆ జిల్లాలోనే తమ డాన్స్ వృత్తిని కొనసాగించాలే తప్ప,వేరే జిల్లాల మాస్టర్లు ఇంకొక జిల్లాకు వెళ్లి డాన్స్ నేర్పడం సమంజసం కాదని వారు అన్నారు.త్వరలో జిల్లా కమిటీ సభ్యులు అందరికీ అసోసియేషన్ ద్వారా ఐడి కార్డులను అందజేస్తామని అసోసియన్ కాదని ఎవరైతే డాన్స్ మాస్టర్లు జిల్లాలో కొనసాగితే వారిపై అసోసియేషన్ తరపున చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా డాన్స్ మాస్టర్ లు,వివిధ మండలాల డాన్స్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐ చీఫ్‌గా ప్రవీణ్ సూద్ కొనసాగింపు

**వేద న్యూస్, న్యూఢిల్లీ:**



కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) చీఫ్‌గా ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ కొనసాగింపుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆయన పదవీకాలం మరో ఏడాది పొడిగించారు. ఈ మేరకు డీవోపీటీ త్వరలో ఉత్తర్వులు ఇవ్వనుంది. ఈనెల 25తో ప్రవీణ్ సూద్ రెండేళ్ల పదవీకాలం ముగియనుంది. ఈ క్రమంలో ఆయన పదవీ కాలం మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. 2023, మే 25న సీబీఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. కాగా నూతన డైరెక్టర్ నియామకంపై సెలెక్ట్ కమిటీ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు.

### సెలక్ట్ కమిటీ భేటీ..

కాగా నూతన సీబీఐ డైరెక్టర్ నియామకం కోసం నిన్న (సోమవారం) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్ కన్నాలతో కూడిన సెలెక్ట్ కమిటీ సమావేశమైంది. తదుపరి డైరెక్టర్ కోసం పలువురు పేర్లతో డీవోపీటీ జాబితాను రూపొందించింది. ప్రతిపాదిత అధికారుల పేర్లపై సెలెక్ట్ కమిటీలో చర్చ జరిగింది. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రస్తుత డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలాన్ని మరో సంవత్సరం పొడిగించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది.

### ప్రధాని మోదీతో రాహుల్ గాంధీ భేటీ..

లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. సౌత్ బ్లాక్‌లోని ప్రధాని కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. పహల్గాం దుర్ఘటన అనంతరం తలెత్తిన పరిస్థితులు, సైన్యం సన్నద్ధతపై రాహుల్‌తో అభిప్రాయాలు పంచుకున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్, సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. నిజానికి ఈ సమావేశం సీబీఐ తదుపరి చీఫ్ ఎంపిక కోసం జరిగింది. సీబీఐ చీఫ్‌ను ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ ఎంపిక చేయాల్సి ఉంది. దాంతో రాహుల్‌తో పాటు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా ప్రధాని కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుత సీబీఐ చీఫ్ ప్రవీణ్ సూద్ ఈ నెలలో పదవీ విరమణ చేయాల్సి ఉంది. సీబీఐ డైరెక్టర్ పదవీకాలం సాధారణంగా రెండేళ్లు ఉంటుంది. అయితే, ప్రత్యేక పరిస్థితుల్లో దీనిని ఐదేళ్ల వరకు పొడిగించే వెసులుబాటు చట్టంలో ఉంది. కాగా కర్ణాటక కేడర్‌కు చెందిన 1986 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్, గతంలో ఆ రాష్ట్ర డీజీపీగా పనిచేశారు. సుబోధ్ కుమార్ జైస్వాల్ స్థానంలో ఆయన 2023 మే నెలలో సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు.

## రోడ్డు ఎత్తు తగ్గిస్తామని తవ్వారు..!

**మొదటి పేజీ తరువాయి**

సమాంతరంగా నిర్మించాలని అసలు ఉద్దేశం. కానీ ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పనులు చూస్తే గతంలో ఎంత ఎత్తులో ఉందో తాజాగా నిర్మించే రోడ్డు మళ్లీ అదే ఎత్తులో వస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. అలాంటప్పుడు రోడ్డులు తువ్వడం ఎందుకు? తిరిగి అంతే ఎత్తులో నిర్మించడం ఎందుకు? ప్రజాధనం వృధా చేయడం ఎందుకు? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల అవగాహన లేమి కారణంగా 30 మీటర్ల రోడ్డు కోసం ఐదు లక్షల వృధా అయినట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు నిధులు ఖర్చయినా లక్ష్యం నెరవేరుతుందా? అంటే అది లేదు తవ్విన ప్రాంతాల నుంచి దిగు వన గల రోడ్డు వరకు ఏటవాలుగా నిర్మిస్తేనే స్థానికులకు ఉపయో గకరంగా ఉంటుందని దిగువ రోడ్డు వద్ద మళ్లీ ఎత్తుగా నిర్మిస్తే ఆ దారి ఉపయోగపడదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు పొరపాటున సరి చేసుకుని స్థానికుల అవసరానికి అనుగుణంగా రోడ్ల నిర్మాణం ఏర్పడతారో లేక పాత రోడ్డు ఉన్నట్లే నిర్మిస్తారా? అన్నది వేచి చూడాలి.

## పాత బంకర్లను పునురుద్ధరిస్తున్న ఇండియన్ ఆర్మీ

**వేద న్యూస్, న్యూఢిల్లీ:**

పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. పాక్ ఉగ్రవాదులను వెంటాడి వేటాడుతామంటూ భారత్ భీషణ ప్రతిజ్ఞ చేయడంతో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఢిల్లీ ముంబై సహా దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్‌కు భారత్ సిద్ధమవుతుండగా, ఇదే సమయంలో అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి దశాబ్దాల నాటి పాత బంకర్లను పునరుద్ధరించే పనులను ఇండియన్ ఆర్మీ చేపట్టింది. కంచుకోట లాంటి ఈ బంకర్లను 1965, 1971 యుద్ధ సమయాల్లో ఆర్మీ వినియోగంలోకి తెచ్చింది. ఇప్పుడు మరోసారి వాటిని పునరుద్ధరిస్తూ ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది.

### బంకర్లలో షెల్టర్

జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దుల వద్ద బలగాలు మరింత అప్రమత్తత పాటిస్తున్నాయి. అత్యవసర పరిస్థితి అంటూ వస్తే సరిహద్దులకు సమీపంలోనే జనవాసాలను ఖాళీ చేయించి వారిని కొత్తగా నిర్మించిన అండర్‌గ్రౌండ్ బంకర్లకు తరలించనున్నారు. సున్నిత ప్రాంతాలైన ఉరి నుంచి నౌషెరా సెక్టార్ వరకూ ప్రజలను ఆ బంకర్లకు తరలిస్తారు. ఎల్ఐసీ, అంతర్జాతీయ సరహద్దులకు సమీపంలోని ఈ బంకర్లలో నీటి సరఫరా, కనీస అవసరాలను అందుబాటులో ఉంచనున్నారు. యుద్ధం అంటూ మొదలైతే ఆ ప్రభావం మొదటగా ఎల్ఓసీ వెంబడి ప్రజలపై పడే అవకాశం ఉండటంతో ముందస్తు భద్రతా చర్యలను ఆర్మీ చేపడుతోంది.

### ఎయిర్ రైడ్ సైరన్ టెస్ట్



కాగా, శ్రీనగర్‌లో దాల్‌లేక్ సమీపంలో ఎయిర్ రైడ్ సైరెన్ మాక్ డ్రిల్స్‌ను మంగళవారంనాడు నిర్వహించారు. హైఅలర్ట్ పరిస్థితుల్లో స్థానిక అధికారులు, భద్రతా అధికారులను అప్రమత్తం చేయడానికి లౌడ్ సైరన్ డ్రిల్స్ జరిపారు. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్, రాజౌరి జిల్లాలో భద్రతను మరింత ఎక్కువ చేశారు. కీలకమైన మార్గాల్లో వాహనాల తనిఖీలను మరింత కట్టుదిట్టం చేశారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073